

మహిళలకు కుట్టుమిషన్ల అందజేత

కామారెడ్డి టౌన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం 20 మంది మహిళలకు కుట్టుమిషన్‌లను అందించారు. ఈ సందర్భంగా రోటరి క్లబ్ అధ్యక్షుడు రాజనరసింహారెడ్డి మాట్లాడుతూ ఎకనామిక్ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌లో భాగంగా బీజీఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్, జూబ్లిహిల్స్ రోటరి సంయుక్త ఆధ్వర్యంలో అందించిన రూ.1లక్ష 60 వేల విలువ గల 20 కుట్టుమిషన్లను అందించామని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్ పి.సత్యం, రోటరియన్స్ మాజీ అసిస్టెంట్ గవర్నర్ శ్రీశైలం, కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి సబ్బని కృష్ణహరి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు అందేలా..!







- నాలుగు పథకాల అమలుకు జిల్లాలో మొదలైన సర్వే
- ఈనెల 26 నుంచి పథకాల అమలు
- కొనసాగుతున్న అర్హుల ఎంపిక ప్రక్రియ
- క్షేత్రస్థాయిలో సూక్ష్మ పరిశీలన
- ఈనెల 24న ప్రభుత్వానికి తుది నివేదిక

కామారెడ్డి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు ఈ నాలుగు పథకాలపై జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఆచితూచి అర్హులను ఎంపిక చేసేందుకు వడపోత కొనసాగిస్తున్నారు. ఈ నాలుగు పథకాల అమలుపై లబ్ధిదారులను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో సర్వే ముమ్మరంగా చేపడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు సర్వేను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తగు సూచనలు ఇస్తున్నారు. ఈ నెల 26 నుంచి ఈ నాలుగు పథకాలను ప్రజలకు అందేలా ప్రభుత్వం శ్రీకారం చుడుతుంది. రెండు రోజులుగా సంబంధిత శాఖాధికారులు, సిబ్బంది సర్వేలో నిమగ్నమయ్యారు. ప్రజాపాలనలో వచ్చిన రేషన్‌కార్డుల దరఖాస్తులపై, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు, రైతుభరోసాపై సర్వే చేపడుతున్నారు. ఈనెల 20 వరకు ఈ సర్వే నిర్వహించి 21 నుంచి గ్రామసభలు నిర్వహించనున్నారు. 24వ తేదీన ప్రభుత్వానికి జిల్లా యంత్రాంగం తుది నివేదికను సమర్పించనున్నారు. ఇందుకోసం కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌తో పాటు అదనపు కలెక్టర్‌లు, ఆయా శాఖల అధిపతులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సర్వేను ముమ్మరం చేశారు.

గ్రామాల్లో సర్వే సందడి

ఈనెల 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా కొన్ని పథకాలను అమలుకు సిద్ధం అవుతోంది. రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అమలులోకి తెచ్చి అర్హులకు ప్రయోజనం చేకూర్చేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు ప్రస్తుతం అధికారులు, సిబ్బంది సర్వేలో బీజీ అయ్యారు. ఈనెల 20వ తేదీ వరకు సర్వే పూర్తి చేయాలని ఆదేశాలు ఉండడంతో క్షేత్రస్థాయిలో కలెక్టర్‌తో పాటు కిందిస్థాయి సిబ్బంది సైతం పర్యటిస్తూ సర్వేలో నిమగ్నమయ్యారు. ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తు చేసుకున్న పథకాల్లో ప్రధానంగా రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసాతో పాటు భూమిలేని కూలీలకు ఆర్థిక సహాయం అందించేందుకు సర్వే మొదలైంది. ప్రస్తుతం ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు, క్షేత్రస్థాయి పరిశీలనతో పాటు వార్డు సభలు, గ్రామసభల ద్వారా అర్హుల జాబితా రూపొందించే పనిలో ఉన్నారు. క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు, రెవెన్యూ సిబ్బందితో బృందాలను నియమించారు. ప్రస్తుతం గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో పర్యవేక్షించి సర్వే చేస్తున్నారు. మొత్తంగా జిల్లా అంతటా సర్వే సందడి కనిపిస్తోంది. కలెక్టర్ మొత్తం ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తు పరిశీలిస్తున్నారు.

పకడ్బందీగా అర్హుల ఎంపిక

ప్రభుత్వం నాలుగు పథకాలను త్వరలో అమలు చేయనున్నందున అర్హుల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను జిల్లా యంత్రాంగం పకడ్బందీగా చేపడుతోంది. రైతుకు ప్రతీ సంవత్సరం ఎకరానికి రూ.12 వేల చొప్పున నగదు జమచేసే ప్రక్రియ మొదలుకానుంది. వానాకాలం, యాసంగి సీజన్‌లలో రూ.6వేల చొప్పున నగదు అందనుంది. జిల్లాలో గత ప్రభుత్వం 2023-24 వానాకాలం సీజన్‌లో రైతుబంధు ద్వారా 2.99 లక్షల మంది రైతులకు రూ.260 కోట్లు, యాసంగి సీజన్‌లో 2.88 లక్షల మంది రైతులకు రూ.280 కోట్లు అందజేసింది. ప్రస్తుతం ప్రభుత్వం రూపొందించిన విధివిధానాల మేరకు ఎందరికి రైతుభరోసా దక్కుతుందో ఈనెల 26న తేలనుంది. ఇందిరమ్మ ఇళ్లు జిల్లాకు 13వేలకు పైగా మంజూరు కానున్నాయి. సుమారు 2.38లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీటి ఆధారంగా క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న సర్వే చివరి దశకు చేరింది. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌లు కూడా తనిఖీలు చేస్తున్నారు. మొదటిదశలో ప్రతీ నియోజకవర్గానికి 3500ల చొప్పున ఇళ్లు కేటాయించనున్నారు. అలాగే భూమిలేని నిరుపేదలకు ప్రతీ సంవత్సరం రూ.12వేల చొప్పున రెండు విడతలుగా ఇచ్చేందుకు అర్హుల కోసం ఆరా తీస్తున్నారు. జిల్లాలో 2 లక్షల మందికి పైగా ఉపాధి హామీ కూలీలు ఉన్నట్లు గుర్తించారు. ఇందిరమ్మ ఆత్మీయభరోసా పేరుతో అమలయ్యే ఈ పథకానికి భూమిలేని నిరుపేదల కుటుంబాన్ని యూనిట్‌గా ఎంపిక చేసి అమలుచేయనున్నట్లు తెలుస్తోంది.

అమలయ్యే పథకాలు ఇవే..

రైతుభరోసా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా అర్హుల జాబితా తయారు చేయడంలో నిమగ్నమయ్యారు. సాగుకు యోగ్యం కాని భూములు, గుట్టలు, నివాసాలు కలిగి ఉన్న ఇతర భూములు వెంచర్‌లు, భూ సేకరణ కింద తీసుకున్న సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, కాలువలు, రైల్వేలైన్, రహదారుల కోసం తీసుకున్న భూముల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. వ్యవసాయ అధికారులు రూపొందించిన జాబితాను క్షేత్రస్థాయిలో సిబ్బంది పరిశీలించాలి. రేషన్‌కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుల పూర్తివివరాలు నమోదు చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో నివసించేవారి వార్షిక ఆదాయం రూ.1.50లక్షలు పట్టణ ప్రాంతాల్లో నివసించే వారికి రూ.2లక్షల వరకు మించి ఉండకూడదు. రేషన్‌కార్డుల్లో పేర్ల తొలగింపు, కొత్తపేర్లు చేర్చడం లాంటి ప్రక్రియ కూడా చేపట్టాలి. ఇందిరమ్మ ఇళ్ల సర్వే జిల్లాలో దాదాపు పూర్తయింది. అర్హుల జాబితా తయారు చేశారు. క్షేత్రస్థాయిలో మరోసారి ఆ జాబితాపై సమగ్ర పరిశీలన చేస్తున్నారు. భూమి లేని నిరుపేదల ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజుల పాటు పని దినాలు కలిగి ఉండాలి. వీరి వివరాలతో అర్హుల జాబితాను రూపొందిస్తున్నారు.

వ్యవసాయానికి పనికిరాని భూములను

రైతుభరోసా నుంచి తొలగించాలి : కలెక్టర్



రైతుభరోసా సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

సదాశివనగర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి యోగ్యతలేని భూములను, గృహ అవసరాలకు వినియోగిస్తున్న భూములను రైతుభరోసా జాబితా నుంచి తొలగించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కొనసాగుతున్న రైతుబంధు భూ సర్వేను పరిశీలించారు. తెలంగాణ ప్రభుత్వం లాభసాటి కావడం కోసం రైతుభరోసా అందించడానికి కార్యాచరణ రూపొందిస్తుందని తెలిపారు. ఇందుకోసం గ్రామాల్లో వ్యవసాయానికి పనికిరాని భూములను, ప్లాట్ల కోసం లేఅవుట్‌లు చేసిన భూములను గుర్తించి వాటిని రైతుబంధు జాబితా నుంచి తొలగించాలని తహసీల్దార్ గంగాసాగర్, ఏవో ప్రజాపతికి తెలిపారు. రైతుభరోసా విషయంలో అక్రమభూములను జాబితాలో చేరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సదాశివనగర్ పీహెచ్‌సీని పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించడంతో పాటు రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. మందుల స్టాక్‌ను పరిశీలించి రోగులతో సత్ప్రవర్తనతో మెదలుకొని మంచి వైద్యం అందిస్తే వైద్యులపై స్థానిక ప్రజలకు నమ్మకం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో చందర్‌నాయక్, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీపీవో తిరుమల ప్రసాద్, వైద్యాధికారిని ఆస్మా, ఎంపీడీవో సంతోష్‌కుమార్, కవిత, సీహెచ్‌వో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలి

- జిల్లా చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి

భిక్కనూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి దాతలు సహకరించాలని జిల్లా గ్రంథాలయాల చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తిప్పాపూర్ గ్రామంలోని రెడ్డిసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా చైర్మన్‌ను సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన హంగులతో గ్రంథాల యాలను అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కుంట లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో పేరిట..

అక్రమ వసూళ్లు!

- జిల్లాలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఎంఎల్‌హెచ్‌పీ బాలక్రిష్ణ
- బాలక్రిష్ణను పట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆర్‌ఎంపీ వైద్యులు
- మెడికల్ ఆఫీసర్‌గా ఫేక్ ఐడీకార్డు
- విధుల నుంచి తొలగిస్తాం : డీఎంహెచ్‌వో

లింగంపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పేరిట రూ.25వేలు వసూళ్లకు పాల్పడి పోలీసులకు చిక్కిన ఎంఎల్‌హెచ్‌పీ బాలక్రిష్ణ. మండలంలో ఆర్‌ఎంపీ వైద్యులు నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్నారని మీ క్లీనిక్‌లపై డీఎంహెచ్‌వో సీరియస్‌గా ఉన్నారని మీ క్లీనిక్‌లను తనిఖీ చేసేందుకు వచ్చారని ఆయన కారులో ఉన్నారు నన్ను చూసి రమ్మన్నారు. ఆయన మీ క్లీనిక్‌లోనికి వస్తే మీపై కేసులు చేసి మీ క్లీనిక్‌ను మూసివేస్తారు అని నమ్మబలికి బెదిరించి రూ.25వేలు వసూలు చేశాడు. మండల కేంద్రంలోని ఎస్‌ఎంపీ క్లీనిక్‌కు చేరుకుని తాను డీఎంహెచ్‌వో ఆఫీసు నుంచి వచ్చాను సార్ బయట ఉన్నారు. రూ.10వేలు ఇస్తే సార్‌ను మేనేజ్ చేస్తాను లేదంటే క్లీనిక్‌ను సీజ్ చేయిస్తాను అని బెదిరించి క్లీనిక్ నిర్వాహకుడు ముబీన్ హుసేన్ వద్ద రూ.10వేలు తీసుకున్నాడు. తరువాత అంబేద్కర్ చౌరాస్తాలోని రషీద్ క్లీనిక్‌కు వెళ్లి అక్కడ అతనిని బెదిరించి అతని వద్ద రూ.15వేలు తీసుకున్నాడు. అనుమానం వచ్చిన క్లీనిక్‌ల నిర్వాహకులు యూనియన్ నాయకులకు చెప్పారు. దీంతో వారు బస్టాండ్ ప్రాంతంలో స్కూటీపై ఉన్న



మెడికల్ ఆఫీసర్‌గా ఫేక్ ఐడీ కార్డు

బాలక్రిష్ణను పట్టుకుని గట్టిగా అడిగి తీసుకువెళ్లి పోలీసులకు అప్పగించారు. వారు అతనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. గత డిసెంబరులో లింగంపేటలోని వేంకటేశ్వర క్లీనిక్‌కు వచ్చి రూ.15వేలు తీసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాలకృష్ణ కామారెడ్డి మండలం లింగాపూర్ గ్రామంలోని పల్లె దవాఖానాలో ఔట్ సోర్సింగ్ విధానంలో ఎంఎల్‌హెచ్‌పీగా విధులు నిర్వహిస్తున్నాడు.



బాలక్రిష్ణ

ఫేక్ ఐడీకార్డు

కామారెడ్డి మండలం లింగాపూర్ గ్రామంలోని పల్లె దవాఖానాలో ఔట్ సోర్సింగ్ విధానంలో ఎంఎల్‌హెచ్‌పీగా విధులు నిర్వహిస్తున్న బాలక్రిష్ణ మెడికల్ ఆఫీసర్‌గా ఫేక్ ఐడీకార్డు సృష్టించుకుని అక్రమ వాసూళ్లకు పాల్పడుతున్నట్లు బాధితుల ఫిర్యాదు మేరకు బాలకృష్ణపై కేసు నమోదు చేసుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై సుధాకర్ తెలిపారు.

విధుల నుంచి తొలగిస్తాం

లింగంపేటలోని పీఎంపీ వైద్యుల నుంచి డీఎంహెచ్‌వో పేరిట అక్రమంగా వసూళ్లకు పాల్పడిన సామల బాలక్రిష్ణను విధుల నుంచి తొలగిస్తామని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ తెలిపారు. లింగాపూర్ పల్లె దవాఖానాలో ఔట్ సోర్సింగ్ విధానంలో ఎమ్ఎల్‌హెచ్‌పీగా విధులు నిర్వహిస్తున్నాడని ఆయనకు మెడికల్ ఆఫీసర్‌గా ఐడీకార్డు ఎవరు తాను ఇవ్వలేదని ఫేక్ ఐడీకార్డు తయారు చేసుకుని పీఎంపీల నుంచి డబ్బులు వసూలు చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. లింగంపేటకు చెందిన పీఎంపీలు ఫిర్యాదు చేస్తే బాలక్రిష్ణను శాశ్వతంగా తొలగిస్తామని ఆయన తెలిపారు.

ఆధార్ తరహాలో అపార్!


- ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు వన్ నేషన్-వన్ స్టూడెంట్ కార్డు
- జిల్లాలో మొదలైన ప్రక్రియ
- ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థుల వివరాల సేకరణ
- ప్రతీ విద్యార్థికి శాశ్వత గుర్తింపు కార్డు అందజేత

కామారెడ్డి టౌన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఆధార్‌కార్డు తరహాలో ఒకే నెంబర్‌తో అపార్‌కార్డును కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులకు పర్మినెంట్ నెంబర్‌తో కూడిన గుర్తింపుకార్డు అందజేస్తోంది. ఆధార్ తరహాలో వన్ నేషన్ - వన్ స్టూడెంట్ ఐడీ పేరుతో 17 అంకెలు గల అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అథెంటిక్ రిజిస్ట్రి) కార్డును అందుబాటులోకి తెచ్చింది. కార్డుల జారీకి సంబంధించి ఇప్పటికే కేంద్ర విద్యాశాఖ రాష్ట్ర విద్యాశాఖకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లాలోని విద్యాశాఖాధికారులు సైతం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల నుంచి వివరాల నమోదుకు ఆయా యాజమాన్యాలకు సూచనలు సైతం చేశారు. గత వారం పది రోజుల నుంచి జిల్లాలో ఈ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది.

అపార్ నమోదుకు ఆదేశాలు జారీ చేశాం

- రాజు, డీఈవో, కామారెడ్డి

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల అపార్ నమోదుకు వివరాలు సేకరించాలని ఆదేశాలు జారీ చేశాం. అపార్ నమోదుకు సంబంధించి త్వరితగతిన పూర్తి చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి. అపార్‌లో డిజిలాకర్ ద్వారా విద్యార్థి వివరాలు నిక్షిప్తం కావడంతో భవిష్యత్తులో అపార్‌ఐడీ చాలా ఉపయోగకరంగా ఉంటుంది.



శాశ్వత గుర్తింపు కార్డు అందజేత

అపార్‌తో ప్రతీ విద్యార్థికి శాశ్వతంగా ప్రత్యేక గుర్తింపు కార్డుసంఖ్యను ఇవ్వనున్నారు. ఈ అపార్ కార్డు ద్వారా ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు బదిలీ సులభం అవుతోంది. రివారుల్లు, డిగ్రీలు, స్కాలర్‌షిప్‌లు, ఇతర క్రెడిట్ వంటి పూర్తి అకాడమిక్ డేటాను డిజిటలైజేషన్ చేయనున్నారు. జిల్లా విద్యాశాఖను ఒక యూనిట్‌గా తీసుకుని ప్రతీ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలోని విద్యార్థుల సంఖ్య, వారి వివరాలన్ని విద్యాశాఖ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ప్రీ ప్రైమరీ నుంచి ఉన్నత విద్య చదివే ప్రతీ విద్యార్థికి పాఠశాల, కళాశాలలు ఈ కార్డులు జారీ చేస్తాయి. వివిధ కారణాలతో తల్లిదండ్రులు బదిలీ అయినప్పుడు విద్యార్థులు ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలలో చేరిన పర్మనెంట్ నెంబర్ మారదు. అదేవిధంగా విద్యార్థుల సంఖ్య, ఉచిత పుస్తకాలు, స్కూల్ యూనిఫాంలు లెక్కించడానికి, మధ్యాహ్న భోజనం సద్వినియోగం అయ్యేలా ఈ కార్డు ఉపయోగపడనుంది.



ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో బోధించాలి

జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం

రామారెడ్డి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ కళాశాలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు బోధించాలని అధ్యాపకులకు కామారెడ్డి జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం సూచించారు. కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బులు ఖర్చు పెట్టుకుని ప్రైవ్రేటు కళాశాలల్లో చదివే బదులు ప్రభుత్వ కళాశా లలను విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. సమయపాలన పాటించి విద్యార్థులకు విద్యాబోధన సక్రమంగా నిర్వహించాలని లెక్చరర్లకు పలు సలహా లు, సూచనలు, పద్ధతులను వివరించారు. మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షల కోసం ఉత్తమ ఫలితాలు వచ్చే విధంగా విద్యార్థులకు పద్ధతులను, సూచనలు లెక్చర్లకు వివరించారు. విద్యార్థులు కళాశాలకు తప్పక హాజరవ్వాలని సూచించారు. అధ్యాపకుల హాజరు పట్టికను, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ, లెక్చరర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫటా..ఫట్...

సంక్షేమ పథకాలు అర్హులకు అందజేస్తాం

● పిట్లం తహసీల్దార్ వేణుగోపాల్



ఆంధ్రజ్యోతి: గ్రామాలలో గ్రామసభలో ఎలాంటి దరఖాస్తులు స్వీకరిస్తారు ?

తహసీల్దార్: ప్రభుత్వం నిరుపేదల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి అందజేస్తాం. ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ భరోసా, రైతు భరోసా, ఆహారభద్రత కార్డుల దరఖాస్తులు స్వీకరిస్తాము.

ఆంధ్రజ్యోతి: గ్రామాలలో సర్వే ఎప్పటి వరకూ చేపడతారు, ఊర్లోలేని వారి వివరాలు ఎలా సేకరిస్తారు?

తహసీల్దార్: ప్రతి గ్రామంలో వ్యవసాయశాఖ, రెవెన్యూ, గ్రామ పంచాయతీ, అధికారులు కలిసి ఉమ్మడి సర్వే చేపడుతున్నాము. ప్రతిగ్రామంలో పకడ్బందీగా సర్వేచేయిస్తున్నాం. గ్రామాలలో లేని వారి వివరాలు సేకరించి వారిలో కూడా అర్హులకు పథకాలు అందజేస్తాం, సర్వేకు గ్రామస్తులు సహకరించాలి.

ఆంధ్రజ్యోతి: రైతు భరోసా ఎలాంటి భూములకు వర్తించదు?

తహసీల్దార్: గ్రామాలలో రైతుల పూర్తి వివరాలు ధరణిలో ఫీడింగ్‌లో ఉన్నాయి, దాని ఆధారంగా ఇటుక బట్టీలు, రైస్‌మిల్‌లు, కోళ్లఫారం, రియల్‌ఎస్టేట్, గుట్టలు, పంటలకు పూర్తిగా సాగుకు నోచుకొని భుములకు రైతు భరోసా రాదు.

ఆంధ్రజ్యోతి: గ్రామ సభలలో సర్వే నివేదికలు వెల్లడిస్తారా, గోప్యంగా ఉంచుతారా?

తహసీల్దార్: గ్రామాలలో సర్వే అనంతరం ప్రత్యేక అధికారులు, గ్రామ ప్రజల సమక్షంలో సర్వే నివేదికలు పూర్తిగా చదివి వినిపిస్తాం, ఎవరి వివరాలూ గోప్యంగా ఉండవు. సాగు భూములకే నివేదికలు పంపుతాం.

అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

● నియోజకవర్గంలో ఏడాదికి 3,500 ఇళ్ల మంజూరు ● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌రూరల్,జనవరి17(ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్ మండల పరిషత్ ప్రాంగణంలో ఇందిరమ్మ ఇంటి మోడల్ హౌస్ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ పార్టీ అన్ని హామీలను అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఏడాదికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ముఖ్యమంత్రి మంజూరు చేశారన్నారు. నాలుగు సంవత్సరాల పాటు అర్హులైన వారందరికీ విడతల వారిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. నిరుపేదలకు ముఖ్యంగా మొదటి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. అధికారులు ఇందిరమ్మ ఇళ్లసర్వే నిర్వహించి జాబితాను రూపొందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాలమోహన్ రెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, మందర్నా రవి, ఎంపీడీవో బాల గంగాదర్, ఎంపీవో మదుకర్, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చీలశంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్థానికసంస్థల ఎన్నికలలో అన్ని స్థానాలూ కైవసం చేసుకోవాలి...

వచ్చే స్థానికసంస్థల ఎన్నికలలో అన్ని స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకునేలా కార్యకర్తలు కృషి చేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని లయన్స్ క్లబ్ సమావేశం మందిరంలో బోధన్, సాలూర మండలాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బీన్ హందాన్, గ్రంథాలయాల సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మహిపాల్ రెడ్డి, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, మందర్నా రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లె రమేష్, గణపతి రెడ్డి, సంజీవ్ రెడ్డి, పోతారెడ్డి, బోధన్, సాలూర మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



దండిగుట్టలో నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బోధన్ ఎమ్మెల్యేను సన్మానించిన మహోదయ క్లబ్ సభ్యులు

నవీపేట : మండల కేంద్రంలోని మహోదయ క్లబ్ నూతన కార్యవర్గసభ్యులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో సన్మానించారు. మహోదయ క్లబ్ అందిస్తున్న వివిధ సేవా కార్యక్రమాలను వారు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మోస్రా సాయిరెడ్డి, సాయిబాబా గౌడ్, రాజేందర్ గౌడ్, గోవర్ధన్, భగవాన్, డాంగే శ్రీనివాస్, సూరిబాబు, శ్రీనివాస్ రెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

ఎడపల్లి : రాష్ట్ర ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని బోధన్ ఎమ్మెల్యే మాజీమంత్రి సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ నమూనా గృహ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లను అందిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి, బోధన్ వ్యవసాయ కమిటీ డైరెక్టర్ బొబ్బిలి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బిల్లా రాంమోహన్, నాయకులు లింగం, ఎల్లయ్య యాదవ్, బంజ కామప్ప, మోహన్ రెడ్డి, పాల్ల భాస్కర్ రెడ్డి, నాయకులు అధికారులు తదితరులు ఉన్నారు.

ఆరు హామీలను నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే

రెంజల్ : ఆరుగ్యారంటీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం అంబేద్కర్‌నగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో నూతన గ్రామ పంచాయతీ భవనానికి భూమిపూజ చేశారు. దండిగుట్టలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం రెంజల్ మండల కేంద్రంలో 105 మంది లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఆయన వెంట ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బీన్ హందాన్, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, మాజీ జడ్పీటీసీ నాగభూషణం రెడ్డి, సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి, సాయిరెడ్డి, జావీదోద్దీన్, సాయిబాబా గౌడ్, సురేందర్ గౌడ్, ధనుంజయ్, రవి, ఎంఎల్ రాజు, యూత్ కాంగ్రెస్ బోధన్ నియోజకవర్గ అధ్యక్షులు కార్తీక్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గైని కిరణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో అధికారుల సర్వే



సర్వేతీరును పరిశీలిస్తున్న అధికారులు

ఆర్మూర్‌టౌన్, జనవరి17(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో జరుగుతున్న కొత్త రేషన్‌కార్డుల సర్వేను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 6,7,8,9,21,24 వార్డులలో లబ్ధిదారుల ఇంటింటికి వెళ్ళి సర్వే అధికారులు చేస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఆయన వెంట కౌన్సిలర్ ఆకుల రాము, సీనియర్ అసిస్టెంట్ శేఖర్, వార్డు ఆఫీసర్ పాల్గొన్నారు.

రుద్రూరు : మండలంలోని అంబం, అక్బర్‌నగర్ గ్రామాలలో రైతుభరోసా, రేషన్‌కార్డుల సర్వేను శుక్రవారం ప్రత్యేక అధికారిణి నిర్మల, తహసీల్దార్ తారాబాయి, ఎంపీడీవో సురేష్‌బాబులు పరిశీలించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కోర్వ భూషణ్, అక్బర్ నగర్ కార్యదర్శి నవీన్, అంబం కార్యదర్శి శ్రావణ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ఉప్లూర్‌లో బాధితులకు చెక్కులు అందజేస్తున్న నాయకులు

కమ్మర్‌పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన ముగ్గురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం గ్రామ కాంగ్రెస్ నాయకులు బాధితుల ఇళ్లకు వెళ్లి చెక్కులను అందజేశారు. గ్రామానికి చెందిన మాసం శ్రీనివాస్ గౌడ్, గట్ల మహేష్, పోతుభాగీర్థ వివిధ కారణాలతో ఆసుపత్రుల్లో చికిత్స తీసుకోగా ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్‌కుమార్ ప్రత్యేక చొరవతో సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాధితకుటుంబాలు సునీల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామకాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్ముల రవీందర్, జిల్లా నాయకుడు బోనగిరి భాస్కర్, ఏఆర్ రెడ్డి, కొమ్ముల శ్రీనివాస్, నరేందర్, తక్కూరి శేఖర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల : మండలంలోని తొర్తి గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన రాజారపు నరేందర్‌కు రూ. 27వేలు, పోతుగంటి శేఖర్‌కు రూ. 32వేలు బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ మంజూరి చేయించినందుకు నాయకులు, లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బెజ్జారపు భాను, మహేష్, కౌడ పెద్ద భూమేష్, సుమన్‌గౌడ్, ఆకుల రమేష్, కుండ శేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

డొంకేశ్వర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండలం నికాల్‌పూర్ గ్రామంలో పేకాటస్థావరంపై దాడిచేసి ఆరుగురిని అరెస్టు చేసినట్టు ఎస్సై చిరంజీవి తెలిపారు. తెలిసిన సమాచారం మేరకు శుక్రవారం నికాల్‌పూర్ గ్రామసమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురు పేకాటరాయుళ్ళను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3,060 నగదుతో పాటు ఐదు సెల్‌ఫోన్‌లు స్వాధీ నం చేసుకున్నామని కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

7న లక్ష డప్పులు, వెయ్యి గొంతుల సభ

బోధన్‌రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 7న చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా లక్షడప్పులు, వెయ్యి గొంతుల సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లస్సింగారి భూమయ్య మాదిగ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణానికి కళాకారుల రథయాత్ర బృందం చేరుకుంది. ఈ సందర్భంగా అంబేద్కర్ కాలనీ, తదితర ప్రాంతాలలో కళాకారులు తమ డప్పువాయిద్యాలతో ప్రజలను ఆలోచింపజేశారు. కార్యక్రమంలో మాదిగ కళామండలి జిల్లా అధ్యక్షులు నల్లా మహేందర్ మాదిగ, డప్పు కళాకారులు డప్పు సంతోష్ మాదిగ, రాంపూర్ సాయి మాదిగ, నవీన్ మాదిగ, నర్సింగ్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గోనేవార్ మారుతీ, రొడ్డ ప్రవీణ్, తాడెం అబ్బయ్య పాల్గొన్నారు.

నకిలీ బీడీ విక్రయదారుడిపై కేసు నమోదు

బోధన్‌రూరల్,జనవరి17(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో నకిలీ వాణి బీడీలు తయారు చేసి విక్రయిస్తున్న లతీఫ్ అనే వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని పలు పాన్‌షాప్‌లలో, కిరాణా షాపులలో నకిలీ బీడీలకు వాణిబీడీల స్టిక్కర్లు అతికించి విక్రయిస్తున్నాడన్న పక్కా సమాచారం మేరకు అతని వద్ద నుంచి 15డబ్బాల వాణి బీడీ బాక్స్‌లను పట్టుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ బీడీలు, గుట్కాలు విక్రయించిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏర్గట్ల పీహెచ్‌సీని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో



సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్

ఏర్గట్ల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను శుక్రవారం ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్ సందర్శించారు. అందులో భాగంగా ఫ్రైడేడ్రైడే గురించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అలాగే ఈ నెల 23న మోర్తాడ్‌లో కుటుంబ నియంత్రణ ఆపరేష్ క్యాంపును ఏర్పాటు చేస్తున్నామని, ఈ క్యాంపును వినియోగించుకునేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రక్షిత రెడ్డి, పండరి, మోహన్, ఆశావర్కర్‌లున్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేని సన్మానిస్తున్న నాయకులు

జక్రాన్‌పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని నిజామాబాద్‌రూరల్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పారి వినోద్‌కుమార్ సన్మానించారు. ఎమ్మెల్యే, సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేతో కూడిన ఫొటోను ఇచ్చి ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యేకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ కాట్‌పల్లి నర్సారెడ్డి, కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ గన్న లక్ష్మణ్, మండల మైనారిటీ అధ్యక్షుడు అక్బర్, మాజీ వైస్‌ఎంపీపీ జితేందర్‌నాయక్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నట్ట తిరుపతి పాల్గొన్నారు.

మనోహరాబాద్‌లో 33 పశువులకు అస్వస్థత

జక్రాన్‌పల్లి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మనోహరాబాద్‌లో శుక్రవారం జొన్న లావలు తిని 33 పశువులు అస్వస్థతకు గురైనట్టు గ్రామస్థులు తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు వెంటనే పశువులను గ్రామానికి తీసుకువచ్చి చికిత్స చేయించారు. అస్వస్థతకు గురైన పశువులకు, చికిత్స చేశామని, పశువులు కోలుకుంటున్నాయని మండల పశువైద్యాధికారిణి డాక్టర్ అశ్రిత తెలిపారు.

వ్యవసాయ భూములకే రైతు భరోసా పథకం



లబ్ధిదారుల వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ అంకిత్

భీమ్‌గల్‌రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పంటలు పండే వ్యవసాయ భూములకే రైతుభరోసా పథకం వర్తిస్తుందని అదనపు కలెక్టర్ అంకిత్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చేంగల్ గ్రామంలో నిర్వహిస్తున్న రేషన్‌కార్డుల సర్వే రైతు భరోస సర్వేను పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి పథకాల సర్వేను పకడ్బందీగా అమలు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న కొత్తరేషన్‌కార్డులు లబ్ధిదారులకు గ్రామసభలు పెట్టి అర్హులైన పేదలను గుర్తించి వారికి రేషన్‌కార్డులు ఇవ్వాలని సూచించారు. అలాగే రైతులు పండించే భూములకే రైతు భరోసా పథకం వర్తిస్తుందని, గుట్టలకు వెంచర్లకు రోడ్లకు ఈ పథకం వర్తించదన్నారు. ఆయన వెంట తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్, ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్, వ్యవసాయ శాఖ అధికారులు, పంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

● ఆర్మూర్ ఎంవీఐ వివేకానంద రెడ్డి

కమ్మర్‌పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డుప్రమాదాలను నివారించాలని ఆర్మూర్ వేకిల్ ఇన్‌స్పెక్టర్ వివేకానంద రెడ్డి అన్నారు. శుక్రవారం కమ్మర్‌పల్లి వచ్చిన సందర్భంగా ఉప్లూర్ వెళ్లే దారిలో పలు వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధృవపత్రాలు లేని నాలుగు ఆటోలు, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. అనంతరం ఆటోడ్రైవర్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయరోడ్డుభద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వాహనాదారులకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఆయతో పాటు ఆర్మూర్ ఆర్టీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

మోస్రాలో గ్రామసభల తేదీల ఖరారు

మోస్రా, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించేందుకు మోస్రాలోని గ్రామాల్లో గ్రామసభల తేదీలు మండల ఎంపీడీవో శ్రీనివాస్ ఖరారు చేశారు. జనవరి నెలలో గ్రామ సభలు పూర్తి కావాలని 21న తిమ్మాపూర్, 22న చింతకుంట, 23న మోస్రా, 24 చే నెంబర్ దుబ్బతండాలో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గోవూర్ గ్రామ శివారులోని పంట భూములను సర్వే చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రమేష్ రాథోడ్, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ మారుతి, ఏఈవో సప్తగిరి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, సహకార సంఘం అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

పట్టాలు పంపిణీ చేయాలని వినతి

కోటగిరి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని చేతన్‌నగర్ గ్రామానికి చెందిన పలువురు రైతులు తమసాగు భూములకు పట్టాపాసు పుస్తకాలు పంపిణీ చేయాలని కోరారు. పోతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో ఈ విషయమై శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గత 20ఏళ్ల క్రితం ప్రభుత్వం గ్రామంలో సాగుభూమి లేని రైతులను గుర్తించి ప్రతి ఒక్కరికి 17 గుంటల భూమిని అందజేసిందన్నారు. 50మందికి పట్టాలు అందించిన మిగిలిన 40 మందికి పట్టాపాసుపుస్తకాలు అందలేదన్నారు. పట్టాపాసు పుస్తకాలు లేకపోవడంతో రైతుబంధు, రైతు బీమా, పంట రుణాలు పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మక్కయ్య, సునీల్, సాయిలు, కవిత తదితరులు పాల్గొన్నారు.

కొలనుపాక మహాపాదయాత్ర కరపత్రాల ఆవిష్కరణ

కోటగిరి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని సుంకిని గ్రామంలో శుక్రవారం శ్రీ సద్గురు సిద్ధి లింగాప్ప మహరాజ్ కొలనుపాక మహ పాదయాత్ర కరపత్రాల ఆవిష్కరించారు. యాదాద్రి జిల్లాలోని కొలనుపాక ఆది జద్గురు రేణుకా చార్య పుణ్యక్షేత్రానికి మార్చి 3వ తేదిన సుంకిని నుండి మహ పాదయాత్ర ప్రారంభం అవుతుందన్నారు. తొమ్మిది రోజుల పాటు కొనసాగే పాదయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాగభూషణం, రాజు, సంతోష్, నాగేష్, మాజీ సర్పంచ్‌లు మాధవరావు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

ఆర్మూర్‌టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాంమందిర్ పాఠశాల ఆవరణలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. సామాజిక, సామరస్యత కార్యక్రమాల్లో పారిశుధ్య కార్మికులను పట్టుశాలువ, పూలమాలతో సన్మానించి భగవద్గీత బుక్‌లను అందజేశారు. కార్యక్రమంలో హిందూ జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, విశేష సంపర్క్ ప్రముఖ్ అల్లాపూర్ అక్షయ్, ప్రచార ప్రముఖ్ నిఖిల్, నగర అధ్యక్షుడు గంగాచరణ్, గంగాధర్‌గౌడ్, కత్తి శీను, అజయ్, అభి, ప్రవీన్, ప్రేమ్, తదితరులు పాల్గొన్నారు.

నాగాపూర్‌లో లిఫ్ట్‌కు రెండోమోటర్ పంపిణీ

ముప్కాల్, జనవరి17(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం నాగాపూర్‌లోని లిఫ్ట్‌కు మంజూరైన రెండోమోటర్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. గతంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తమ లిఫ్ట్‌కు రెండోమోటర్ కావాలని బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్‌ను విన్నవించన వెంటనే స్పందించి రెండోమోటర్‌ను పంపిణీ చేసినందున ఆయనకు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాగాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

భీమ్‌గల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని కప్పాలవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ని పట్టుకున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు. గురువారం రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా భీమ్‌గల్ పట్టణంలో ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఆపి డ్రైవర్ అలకుండ సింహాద్రి వద్ద ఎలాంటి పత్రాలు లేనందున ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

మండల బీజేపీ అధ్యక్షుడికి సన్మానం


జక్రాన్‌పల్లి, జనవరి17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణ్‌పల్లిలో మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నూతనంగా బీజేపీ అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్‌ను మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు నిటిశేఖర్ సన్మానించారు. అనంతరం కన్నెపల్లి ప్రసాద్‌ను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కన్నెపల్లి ప్రసాద్ మాట్లాడుతూ పద్మశాలిలు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో ఎదిగి ముందుకు వెళ్లేందుకు కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం నాయకులు రాజేందర్, శ్రీకాంత్, రాజేశ్వర్, స్వామి, శ్రీనివాస్, రణవీర్; పద్మశాలి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

20న బషీరాబాద్ ఐటీఐలో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళా

కమ్మర్‌పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20న కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్‌లోని తెలంగాణ ప్రభుత్వ ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళా నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో ఈ నెల 20న బషీరాబాద్ ఐటీఐ కళాశాలలో ఉదయం 10 గంటల వరకు హాజరుకావాలని తెలిపారు. ఈ మేళాలో వరుణ్‌మోటార్స్ హైదరాబాద్ కంపెని, సుఖ్జీత్ స్టార్చ్‌మిల్ కంపెని నిజామాబాద్, ప్రీమియర్ ఎనెర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెని హైదరాబాద్, ఎవరెస్టు స్కాలేస్ కంపెని సారంగపూర్ వారు హాజరై ఇంటర్వ్యూల ద్వారా ఎంపికచేసుకుంటారని తెలిపారు. ఆసక్తిగల నిరుద్యోగులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గూగుల్ ఫారం లింక్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

రైతుల అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

● బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు

భీమ్‌గల్, జనవరి17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రైతులకు బీజేపీ అండగా నిలుస్తుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఎల్‌జె. ఫంక్షన్‌హాల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర రైతుల చిరకాల వాంఛ అయిన పసుపుబోర్డును జిల్లాకు తీసుకువచ్చేందుకు రెండోసారి ఎంపీగా గెలిచిన అర్వింద్ నిరంతరం కృషి చేయడంలో ప్రధాని మోదీ కేంద్ర మంతి పీయుష్‌గోయల్‌కు జిల్లా పసుపుబోర్డు కేటాయించడంతో పాటు జాతీయ పసుపుబోర్డు చైర్మన్‌గా ఇదే ప్రాంతానికి చెందిన పల్లె గంగారెడ్డి నియమించడంతో రైతాంగంపై ప్రధానికి ఉన్న అభిమానాన్ని నిరూపించుకున్నారన్నారు. కానీ ఇవన్ని ఎరుగని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తాము లేఖలు రాస్తేనే వచ్చాయని భుజాలు తడుముకోవడం హస్యాస్పదంగా ఉందన్నారు. కవిత ఎంపీగా ఉండి ఏనాడు కూడా ప్రపోజల్ తీసుకురాకుండా ఇక్కడి రైతాంగాన్ని మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందే ప్రధాని మోదీ జిల్లాకు పసుపుబోర్డును ప్రకటించారని, ఎన్నికలకు ముందు బట్టాపూర్ మైనింగ్ అక్రమాలపై మాట్లాడిన మానాల మోహన్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు మాట్లాడంలేదని ప్రశ్నించారు. అనంతరం భీమ్‌గల్ బస్టాండ్ ప్రాంతంలో ప్రధాని మోదీ, ఎంపీ అర్వింద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సమావేశంలో మండల, పట్టణ బీజేపీ అధ్యక్షులు మహిపాల్, కనికరం మధు, పట్టణ రైతు అధ్యక్షుడు తోట గంగాధర్, నీలం గంగాధర్, బీజేవైఎం అధ్యక్షుడు చందు, నాయకులు హకీంబాయ్, గంగాధర్‌గౌడ్, సంధ్యా, రాజు, నవీన్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లాకు పసుపు బోర్డు తీసుకువచ్చిన ఘనత బీజేపీదే

బోధన్‌రూరల్ : రాష్ట్రంలో జిల్లాకు పసుపుబోర్డు తీసుకువచ్చిన ఘనత కేంద్ర ప్రభుత్వం బీజేపీదేనని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా నియమితులైన పల్లెగంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీ అనేక రకాలుగా కృషి చేస్తున్నారన్నారు. వచ్చే సంస్థాగత ఎన్నికలలో బీజేపీ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో బీజేపీ పార్టీ పూర్తి స్థాయిలో బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రాష్ట్రానికి ఇచ్చిన ఒక్కో హామీని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందని, దీనికి పసుపు బోర్డే ఉదాహరణగా వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి సుధాకర్‌చారి, బోధన్ పట్టణ అధ్యక్షులు కొలిపాక బాలరాజు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రామరాజు, బీజేపీ కౌన్సిలర్ వినోద్, నాయకులు ప్రతాప్‌గుప్తా, సంగ్రామ్‌పటేల్, ధర్మన్న, వాసు, అరవింద్, సాయినాథ్, గంగాధర్, సన్నీలతో బీజేపీ నాయకులు తదితరులున్నారు.

పసుపుబోర్డు ఏర్పాటుకు కేఆర్.సురేష్‌రెడ్డి నిరంతర కృషి

ఆర్మూర్‌రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు పసుపుబోర్డు మంజూరు కావడం వెనుక బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఫ్లోర్ లీడర్ కేఆర్.సురేష్‌రెడ్డి కృషి ఉందని రాంపూర్ మాజీసర్పంచ్ బొడ్డు గంగాధర్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. పసుపుబోర్డు ఏర్పాటుపై పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని ప్రశ్నించి నిలదీసి ఒప్పించిన కేఆర్.సురేష్‌రెడ్డి నిరంతరం రైతుల సంక్షేమం కోసం కృషి చేశారని ఆయన అన్నారు.

పసుపుబోర్డు విధివిధానాలను రైతులకు తెలపాలి

వేల్పూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఏర్పాటైన జాతీయ పసుపుబోర్డు విధివిధానాలను రైతులకు తెలియజేయాలని బీఆర్ఎస్ జిల్లా రైతునాయకుడు మిట్టపల్లి మహిపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పసుపు రైతుల సుధీర్ఘ కాల పోరాటం వల్లనే పసుపుబోర్డు నిజామాబాద్‌లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ బోర్డు వల్ల రైతులకే కలిగే ప్రయోజనాలు ఏ విధంగా ఉంటాయో వివరించాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ మండలాల్లో పసుపు పంటను అధికంగా సాగుచేస్తున్నందున వేల్పూర్ మండలం లక్కోర గ్రామ సమీపంలో బీఆర్ఎస్ హయాంలో 42ఎకరాలలో టర్మారిక్ స్పైస్‌పార్క్‌లో పసుపు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. పసుపునకు డిమాండ్ పెరిగే విధంగా చూసే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లపై ఉందని పేర్కొన్నారు.

దర్జాగా పేకాట

- పోలీసులకు అందుతున్న నెలనెలా మామూళ్లు
- మురాలుగా ఏర్పడి కేటీ కిరాయి తీస్తున్న పేకాట రాయుళ్లు
- విజిలెన్స్, టాస్క్‌ఫోర్సు వారంటే వారికి షరా మామూలే

నసురుల్లాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు మైలారం, లింగంపల్లి తండా, హాజీపూర్, సంఘం గ్రామాల్లో పేకాటకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పేకాటరాయులకు నసురుల్లాబాద్ మండలంలో పత్తలాడితే ఎలాంటి ఢోకా ఉండదని తమ దిన చర్యకు ఆటంకాలు రావని ఒక భరోసా ప్రతీ నిత్యం నసురుల్లాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో అడవి ప్రాంతాలను ఆసరాగా చేసుకుని అడ్డాలను మారుస్తూ తమ పేకాటను పేకాట రాయుళ్లు దర్జాగా కొనసాగిస్తున్నారు. పేకాటరాయుళ్లకు ఫోన్లు చేసి మరీ రప్పించుకొని పేకాట కేంద్రాలను నిర్వహిస్తున్న నిర్వాహకులు పేకాటను అలవోకగా ఆడిస్తున్నట్లు సమాచారం. సుమారు ఒక్కరోజు లక్షల రూపాయల్లో టర్నోవర్ చేస్తూ పేకాటాడే వారి జీవితాలను బుగ్గిపాలు చేస్తున్నారు. దీనిలో ఆట ఆడించేవారు రోజుకు రూ.20 వేల నుంచి రూ.30 వేలు కేటీ కిరాయి తీస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. దీనికోసం నెలనెలా పోలీసులకు మామూలు ముట్ట చెబుతున్నారని నసురుల్లాబాద్ మండలంలో ప్రచారం జోరుగా కొనసాగుతుంది. ఒక తరహాలో విజిలెన్స్, టాస్క్‌ఫోర్సు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు పేకాట స్థావరాలపై దాడులు చేసేందుకు వస్తున్నారని తెలిసిన మరుక్షణమే అదురు బెదురు లేకుండా తమకేం కాదు అన్నట్లుగా దర్జాగా పతలాటను కొనసాగి స్తున్నారు. ఇది ఏమిటని ఆరా తీస్తే ఇంటలిజెన్స్, టాస్క్‌ఫోర్సు, విజిలెన్స్ పోలీసు లకు స్థానిక పోలీసులే తప్పుదోవ పట్టిస్తూ పేకాట స్థావరాలను కంటికి రెప్పల కాపాడుకుంటున్నారని విమర్శలు మండలంలో చక్కర్లు కొడుతున్నాయి. గతంలో మండలంలో ఇలాంటి తతంగమే కొనసాగిందని, దీంతో అప్పట్లో ఆంధ్రజ్యోతి పత్రిక అడవిలో పేకాట అనే వార్త ప్రచురితమైతే అప్పటి ఎస్పీ స్పందించి స్థానిక పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసి పేకాట నివారణపై ఉక్కుపాదం మోపారు. ప్రస్తుతం మండలంలో మళ్లీ పాత రోజులే కొనసాగుతున్నట్లుగా పత్తలాట మరి జోరందుకుంది.. పేకాట ఆడడానికి వస్తున్న వారి కుటుంబాలు, తమ బతుకులు చిత్రం అవుతున్నాయని, తమ కుటుంబాలు రోడ్డున పడుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు సైతం మండలంలోని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి పేకాట స్థావరాలను నడిపిస్తున్న పేకాటరాయుళ్ల ఆట కట్టించి పత్తా లాటని జాడ లేకుండా చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలు మొర పెట్టుకుంటున్నారు.

● పేకాట ఆడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు



నసురుల్లాబాద్ మండలంలో పేకాట ఆడుతున్న వారు ఎంతటి వారైనా ఉపేక్షిం చేది లేదని ఎస్సై లావణ్య అన్నారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి వివరణ కోరగా నసురుల్లాబాద్ మండలంలో పేకాట ఆడుతున్నట్లు తమకు సమాచారం లేదని, అలాంటి సమాచారం ఎవరు ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆమె తెలిపారు.. - లావణ్య, ఎస్ఐ, నసురుల్లాబాద్

సమస్యల వలయంలో సిర్నాపల్లి

- ఎక్కడి సమస్యలు అక్కడే
- ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు



గ్రామ పంచాయతీ కార్యాలయం

ఇందల్వాయి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్నాపల్లి ఓ మారుమూల గ్రామం. ఒకప్పుడు మావోయిస్టు ప్రాబల్యం ఉన్న గ్రామాల్లో ప్రధానమైనవి. సిర్నాపల్లి గ్రామాన్ని శీలం జానకీబాయి పరిపాలించిన గ్రామం. ఆ గ్రామం నేడు సమస్యలతో కొట్టుమిట్టాడుతుంది. గ్రామంలో ప్రధాన రోడ్లు, పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత, సీసీ రోడ్ల నిర్మాణం, శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల, ఆర్అండ్‌బీ రోడ్ల బ్రిడ్జి నిర్మాణం లేక అభివృద్ధికి నోచుకోక ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమిస్తున్నాయి.

సిర్నాపల్లి నుంచి కామారెడ్డి వరకు రోడ్డు నిర్మాణం

సిర్నాపల్లి గ్రామస్థులు వివిధ అవసరాల కోసం 35 కిలోమీటర్ల దూరంలో గల నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వస్తుంటారు. సిర్నాపల్లి



సిర్నాపల్లి గ్రామంలో మట్టిరోడ్డు

నుంచి గిద్దె, ఉప్పల్వాయి మీదుగా కామారెడ్డి వరకు గతంలో కాలిబాట ఉండేది. ఆ బాట వెంట బైకుల ద్వారా వివిధ పనుల కోసం గ్రామస్థులు కామారెడ్డికి వస్తూ పోతుంటారు. ఆ రోడ్డు బాగా లేక రాళ్లు, రప్పలు, గుంతలతో కూడిన రోడ్డు మార్గాన కామారెడ్డికి వెళ్లాలంటే గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిర్నాపల్లి నుంచి గిద్దె మీదుగా కామారెడ్డి వరకు రోడ్డు నిర్మాణం చేపడితే అర గంటలో కామారెడ్డికి చేరుకునే అవకాశం ఉంది. ఈ రహదారి మొత్తం అటవీ ప్రాంతంలో ఉండటంతో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సహకారంతో రెండు కల్వర్టు పనులు పూర్తికాగా మిగతా పనులు నిధులలేమితో రోడ్డు పనులు నిలిచిపోయాయి. గతంలో ప్రజాప్రతినిధులకు విన్నవించిన పట్టించుకోలేదు.

బుగ్గవాగు బ్రిడ్జి నిర్మాణం

ఊరు చివరన నెలకొల్పిన స్మశాన వాటికకు వెళ్లాలంటే బుగ్గవాగు దాటి వెళ్లాల్సిందే. గ్రామంలో ఎవరు చనిపోయిన శవపేటికను స్మశాన వాటికలో దహన సంస్కరాలు చేయాల్సి ఉంటుంది. వర్షాకాలంలో ఎవరైనా చనిపోతే శవపేటికను బుగ్గవాగు దాటి స్మశాన వాటికలో దహన సంస్కరాలు చేయడానికి గ్రామస్తులు నానా తంటాలు పడుతుంటారు.

సీసీ రోడ్ల నిర్మాణం

గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం నేటికి పూర్తికాలేదు. చాలా వార్డులలో ఇంకా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇందిరమ్మ కాలనీ నుంచి గాంధీ విగ్రహం వరకు వాటర్‌ఫాల్స్ వెళ్లే మార్గంలో తారు రోడ్డు నిర్మాణం, కొయ్యల గేటు నిర్మాణం లేకపోవడంతో వ్యవసాయ రైతులు పొలం వద్దకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. శీలం జానకీబాయి విగ్రహాలకు వెళ్లే దారిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టవల్సి ఉంది. స్కూల్‌లో టీచర్ల కొరత ఉండటంతో విద్యా వలంటీర్లను ఉపయోగించి విద్యా బోధన కొనసాగిస్తున్నారు.

శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాల

ప్రతిరోజు మూగజీవాలకు వైద్యం అందించే పశు వైద్యశాల ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. స్లాబ్ పైకప్పు పెచ్చులు ఊడటంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో వైద్యం అందిస్తున్న డాక్టర్లు జంకుతున్నారు.

ఆర్అండ్‌బీ రోడ్డు బ్రిడ్జి నిర్మాణం

నిజామాబాద్ నుంచి సిర్నాపల్లికి వెళ్లాలంటే ఒకేఒక్క మార్గం ఆర్ అండ్‌బీ రోడ్డు. ఆ రోడ్డు ద్వారానే బస్సులు, బైకులు, ఆటోలు ఇతర ప్రాంతాలకు వెళ్తుంటాయి. ఊరు చివరన ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు బ్రిడ్జి తక్కువ ఎత్తులో ఉండటంతో వర్షాకాలం వరద ఉధృతి బ్రిడ్జిపై నుంచి వరద నీరు పొంగి పొర్లడంతో రాకపోకలు స్థంభించిపోతున్నాయి. ఎక్కడ వానలు అక్కడే నిలిచిపోవడంతో గ్రామస్థులు ఇతర గ్రామాలకు వెళ్లకుండా ఇబ్బందులు పడుతున్నారు. వివిధ రకాల సమస్యలతో ఎదుర్కొంటున్న సిర్నాపల్లి గ్రామాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని అన్ని విధాల అభివృద్ధి చేయాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.



శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాల

గ్రామంలో అన్నీ సమస్యలే..

● సొప్పరి నర్సయ్య, గ్రామస్థుడు



గ్రామంలో అన్నీ సమస్యలే దర్శనమిస్తున్నాయి. చాలా వార్డుల్లో సీసీ రోడ్లు లేవు. వర్షా కాలం వస్తే అంతే సంగతులు. బుగ్గవాగు నిర్మాణం, పశు వైద్యశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. అధికారులు స్పందించి గ్రామ సమస్యలు తీర్చాలి.

గిద్దె రోడ్డు పూర్తి చేయాలి..

● బేక్మాల్ పురేందర్, గ్రామస్థుడు



సిర్నాపల్లి నుంచి కామారెడ్డికి వెళ్లడానికి తారు రోడ్డు, ఆర్అండ్‌బీ రోడ్డు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి. సిర్నాపల్లికి రావడానికి రహదారి లేక వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. సిర్నాపల్లి గ్రామాన్ని దత్తత తీసుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని అధికారులను కోరుతున్నా.

భారంగా మారిన రైతు వేదికల నిర్వహణ

- నిధులు లేక ఇబ్బందులు పడుతున్న ఏఈవోలు



చెట్లతో నిండిపోయిన రైతు వేదిక

మద్నూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలో భౌగోళికంగా వ్యవసాయ వనరులు పుష్కలంగా ఉండడంతో వ్యవసాయ రంగంలో రైతులను చైతన్యవంతం చేసేందుకు నూతన పద్ధతుల్లో సాగు చేయడంలో నైపుణ్యం పెంచేందుకు రైతు వేదికలను గత ప్రభుత్వం నిర్మించింది. ఐదు వేల మంది రైతులకు ఒక క్లస్టర్ ఏర్పాటు చేసింది. ఒక్కో క్లస్టర్‌లో ఒక రైతు వేదిక నిర్మించింది. వీటిల్లో రైతులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. రైతు వేదికలలో పంటల సాగులో అనుసరించాల్సిన కొత్త విధానాలను రైతులకు వివరిస్తున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు నిర్వహణ భారంగా మారింది. 2002-23 ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు నెలలకు గాను రూ.9వేల చొప్పున రూ.45 వేలు ప్రభుత్వం విడుదల చేసింది. ఆ తర్వాత నిధులు మంజూరుకు నోచుకోకపోవడంతో ఏఈఓలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 104 క్లస్టర్లను ఏర్పాటు చేసింది. ఒక్కో క్లస్టర్‌కు ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద పది లక్షలు, వ్యవసాయ శాఖ నిధులు రూ.12లక్షల చొప్పున రూ.22 లక్షలను ఖర్చు చేసి క్లస్టర్‌ను ఏర్పాటు చేశారు. ప్రతీ రైతువేదికలో సమావేశాలు నిర్వహించుకునేందుకు కుర్చీలు తదితర సామగ్రి సమకూర్చారు. వ్యవసాయ విశ్వ విద్యాలయం నుంచి శాస్త్రవేత్తలు రైతుల సందేహాలను నివృత్తి చేసేందుకు అన్నదాతలతో మాట్లాడేందుకు వీలుగా ఆయా రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కల్పించారు. మండల కేంద్రానికి ఒకటి చొప్పున వీసీ సదుపాయం ఉంది. చాలా క్లస్టర్లలో రైతు వేదికలు గ్రామాలకు దూరంగా నిర్మించారు. మహిళా ఏఈవోలు ఈ వేదికలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలకు దూరంగా ఉన్న రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన వీసీ పరికరాలు ఫర్నిచర్‌కు భద్రత కరువైంది. ఏఈవోలు నిత్యం వేదికలు శుభ్రం చేసేందుకు స్వీపర్లను నియమించుకున్నారు. ప్రతీనెల స్వీపర్లకు జీతభత్యాలు చెల్లించాల్సి ఉంటుంది. నిధులు రాకపోవడంతో పనిచేసేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇంటర్నెట్ కనెక్షన్లు ఇవ్వలేదు. ప్రతీ నెల విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. వీటిని చెల్లించే నిధులు లేక విద్యుత్తు సిబ్బందికి ముఖం చాటేస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులు కనెక్షన్లను కట్ చేస్తామని అంటున్నప్పటికీ ఉన్నతాధికారులు సర్ది చెప్పుకొస్తున్నారు.

● ఖర్చుల భారం ఏఈవోలపైనే

సమావేశాలు నిర్వహించే సమయాల్లో టీ, బిస్కెట్లు ఖర్చులు ఏఈవోలు భరిస్తున్నారు. ప్రతీ మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వ హిస్తున్నారు. వీటికి హాజరయ్యే రైతులకు మంచినీరు అందించాలన్న భారం పడుతుంది. ఈ వేదికల్లో టాయిలెట్లు లేకపోవడంతో మహిళా ఏఈఓలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని వేదికల్లో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు పనిచేయడం లేదు. చుటూ పెన్సింగ్ లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి.

నిర్మించారు .. వదిలేశారు

డిచ్‌పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : గత ఎనిమిదేళ్లగా మండలంలోని ఘన్ పూర్ వైకుంఠధామం అసంపూర్తిగా నిర్మాణం వదిలేయడంతో గ్రామస్థులకు వాడుకలోకి రాకుండా పోయింది. లక్షల రూపాయలతో నిర్మించిన స్నానాల గదుల తలుపులు దొంగలు పగలగొట్టి ఎత్తికెళ్లారు. విలువైన బోరు మోటారు చోరీయ కావడంతో చుక్క నీరు లేక గ్రామస్థులు చివరి మజిలి కార్యక్రమంలో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైన పూర్తి స్థాయిలో వైకుంఠధామం నిర్మించి వాడుకలోకి తీసుకురావలని కోరుతున్నారు.



ప్రారంభోత్సవానికి నోచుకోని వైకుంఠధామం



బోరు మోటారు ఎత్తుకెళ్లిన దృశ్యం



ధ్వంసమైన తలుపులు



అలంకారప్రాయంగా మారిన స్నానాల గదులు

ఎల్లారెడ్డిలో ముగిసిన కబడ్డీ టోర్నమెంట్

- మొదటి విజేతగా హాజీపూర్ తండా జట్టు

ఎల్లారెడ్డి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కన సత్యం టౌన్‌షిప్‌లో సంక్రాంతి పండుగ సందర్భంగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ ఆధ్వర్యంలో గత రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిసాయి. ఈ పోటీల్లో మొదటి విజేతగా హాజీపూర్ తండా కబడ్డీ జట్టు విజేతగా నిలిచి రూ. 51 వేలు, రెండో విజేతగా ఎల్లారెడ్డి టీమ్ రూ.21 వేలు, మూడో విజేతగా భిక్కనూర్, మాచాపూర్ జట్లకు రూ.11 వేల నగదు బహుమతి గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్, సీఐ రవీందర్ నాయక్, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు సిద్దు, మార్కెట్ కమిటీ చైర్మన్ రజితారెడ్డి, నాయకులు ప్రశాంత్‌గౌడ్, సామెల్, జక్కుల సంతోష్, వ్యాయామ ఉపాధ్యాయులు అతిక్ ఉల్లా తదితరులు క్రీడలను వీక్షించి అభినందించారు.



కబడ్డీ పోటీల్లో రూ.51 వేలు గెలుచుకున్న క్రీడాకారులు

క్రికెట్ టోర్నీ విజేతగా బాబాపూర్ జట్టు

భీమ్‌గల్ రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పురాణిపేట్ గ్రామంలో గత వారం రోజులుగా నుంచి నిర్వహిస్తున్న కస్తూరి రాజుబాయి స్మారక క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. ఫైనల్‌లో బాబాపూర్, పురాణిపేట్ జట్టు తలపడగా విన్నర్‌గా బాబాపూర్ జట్టు, రన్నర్ అప్‌గా పురాణిపేట్ నిలిచాయి. మొదటి బ్యాటింగ్ చేసిన బాబాపూర్ జట్టు నిర్దేశించిన 52 పరుగుల ఆరు ఓవర్‌లలో టార్గెట్‌ని పురాణిపేట్ జట్టు ఒక్క పరుగు వెనుకబడి విజయ అవకాశాన్ని కోల్పోయారు. అనంతరం విజేతలకు ట్రోఫీ ప్రైజ్‌మనీ రూ.10వేలు, రన్నర్ అప్‌గా నిలిచిన పురాణిపేట్ జట్టుకు రూ.7వేలు మేనేజ్‌మెంట్, గ్రామస్థులు అందజేసి క్రీడాకారులను అభినందించారు.



బాబాపూర్ జట్టుకు షీల్డ్ అందజేస్తున్న దృశ్యం



మహాగణపతి ఆలయంలోని గణపతి విగ్రహం



సామూహిక సంకష్ట చతుర్థి పూజలు

గణపతి ఆలయాల్లో సామూహిక సంకష్ట చతుర్థి పూజలు

నిజామాబాద్ కల్చరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గణనాథునికి ప్రీతికరమైన చతుర్థి పూజలను శుక్రవారం గణపతి ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో గణపతికి గణపతి అధర్వన శీర్షంతో అభిషేకాలు, ప్రత్యేక గరిక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాల్లో సామూహిక సంకష్ట చతుర్థి పూజలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని సార్వ జానిక్ గణపతి ఆలయంలో నిర్వహించిన చతుర్థి పూజలో భక్తులు గణనాథునికి విశేష పూజలు నిర్వహించి ఆలయంలో జరిగిన సామూహిక సంకష్ట చతుర్థి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏలేటి పశుపతిశర్మ వేదమంత్రాలు పఠిం చగా భక్తులు పూజలు చేశారు.

వన మహోత్సవానికి ఏర్పాట్లు

- కోటగిరి ఉమ్మడి మండలంలో 2.24లక్షల మొక్కల లక్ష్యం



నర్సరీలకు మట్టి తరలిస్తున్న దృశ్యం

కోటగిరి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో హరితహారంలో భాగంగా మొక్కలు పెంచేందుకు అధికారులు ప్రణాళికలు పూర్తి చేశారు. ప్రతీ గ్రామ పంచాయతీల్లోని పల్లె నర్సరీల్లో జనాభా ప్రతిపాదికన మొక్కలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నారు. ఉమ్మడి కోటగిరి మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతి గ్రామ పంచాయతీకి 8వేల మొక్కల చొప్పున 2.24లక్షల మొక్కల పెంపకం చేపట్టనున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో పల్లె నర్సరీల నిర్వహణ కొనసాగుతుంది. అధికారులు ఉపాధి హామీ కూలీల చేత ప్లాస్టిక్ సంచుల్లో మట్టి నింపించడం, అందులో విత్తనాలు పెట్టించడం వంటి పనులు కొనసాగిస్తున్నారు.

● నర్సరీల్లో మూడు రకాల మొక్కల పెంపకానికి ప్రాధాన్యత

వివిధ ప్రాంతాల్లోని గ్రామ పంచాయతీల్లో ఉన్న నర్సరీల్లో పూలు, పండ్లు, నీడ నిచ్చే మొక్కలు పెంచేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. వన మహోత్సవంలో భాగంగా వచ్చే వానాకాలంలో ఇంటింటికి పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. నీడను ఇచ్చే మొక్కలను అవెన్యూ ప్లాంటేషన్, రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ స్థలాల్లో నాటుతామని అధికారులు పేర్కొంటున్నారు.

● గతంలో 10వేల నుంచి ప్రస్తుతం 8వేలకు పరిమితం

గత ఏడాది ప్రభుత్వం వన మహోత్సవంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీ నర్సరీల్లో 10వేలకు పైగా మొక్కలను పెంచడానికి లక్ష్యం నిర్దేశించుకుంది. గత ఏడాది నర్సరీల్లో పెంచిన మొక్కలను ఆయా ప్రాంతాలకు తరలించగా మిగిలిపోయిన మొక్కలు వృథా అయ్యాయి. ఆ స్థానంలో ప్రతీ గ్రామ పంచాయతీలో రెండు వేల మొక్కల పెంపకాన్ని తగ్గించి 8వేలకు పరిమితం చేశారు. ప్రస్తుతం ఆయా నర్సరీలలో గత ఏడాది మొక్కలు అలాగే దర్శనమిస్తున్నాయి. ఈ ఏడాదైనా నర్సరీల్లో పెంచిన మొక్కలను లక్ష్యం మేర పంపిణీ చేసేలా అధికార యంత్రాంగం దృష్టి సారిస్తే మేలని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

నిర్దేశించిన లక్ష్యం మేర మొక్కలు పెంచుతాం

● గంగారాం, ఏపీవో, కోటగిరి

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ఉమ్మడి మండలంలో 2. 24లక్షల మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వచ్చే వానాకాలంలో నిర్వహించే వన మహోత్సవం కార్యక్రమానికి మొక్కలను సిద్ధం చేస్తాం.



జల్లాపల్లిలో బ్యాగుల్లో మట్టి నింపుతున్న దృశ్యం



మట్టిలో ఎరువు కలుపుతున్న దృశ్యం

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకపోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు-1, చరిత్ర-1 పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ పాసై ఉండాలని, ఎస్సీ, ఎస్టీలకు 50శాతం సరిపోతుందని తెలిపారు. పీహెచ్‌డీ/నెట్/సెట్/బోధనానుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఎంపిక ప్రక్రియ కళాశాల విద్యా కమిషనర్ నిబంధనల ప్రకారం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 18 నుంచి 20 వరకు సాయంత్రం 4 గంటలలోపు తమ దరఖాస్తులు కళాశాల పనివేళల్లో అందజేయాలన్నారు. ఈ నెల 22 ఉదయం 10 గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.

ప్రతీఒక్కరు అవయవ దానానికి ముందుకు రావాలి

భిక్కనూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు అవయవ దానానికి ముందుకు రావాలని జీవన్‌దాన్ ప్రతినిధి శివకుమార్ కోరారు. మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన నడిపోల్ల బాలమల్లయ్య ఇటీవల మరణించగా కుటుంబసభ్యుల అనుమతితో అతడి అవయవాలను జీవన్‌దాన్ సంస్థకు దానం చేశారు. ఈ మేరకు శుక్రవారం మృతుడి భార్య అంజవ్వకు జీవదాన్ సంస్థ ప్రతినిధులు ప్రశంసపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, గ్రామస్థులు భీంరెడ్డి, కుంట లింగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, స్వామి, తదితరులు పాల్గొన్నారు.



టీటీడీలో శ్రీవారికి వెండి అభయ హస్తాన్ని సమర్పిస్తున్న దృశ్యం

శ్రీవారికి 573 గ్రాముల వెండి అభయహస్తం వితరణ

బీర్కూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో కొలువు దీరిన కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి శుక్రవారం ఒక భక్తుడు వెండి అభయహస్తం సమర్పించాడు. బాన్సువాడ మండలం మహమ్మద్ నగర్ గ్రామానికి చెందిన ముప్పిడి శ్రీనివాస్ అనే భక్తుడు స్వామి వారికి 573 గ్రాముల వెండితో అభయ హస్తంను తయారు చేయించారు. ఈ మేరకు శ్రీనివాస్ కుటుంబ సమేతంగా టీటీడీకి విచ్చేసి స్వామి వారిని, అమ్మ వార్లను దర్శించుకున్నారు. అనంతరం అభయ హస్తంను కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు అభయ హస్తాన్ని స్వామి వారికి సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు దాతకు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకట నరసరాజు, ఆలయ ప్రధాన అర్చకులు నందకిషోర్, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో నేడే నవోదయ ప్రవేశ పరీక్షలు

బాన్సువాడ టౌన్: జవహర్ నవోదయ ప్రవేశపరీక్ష శనివారం నిర్వహిస్తున్నట్లు బాన్సువాడ మండల విద్యాశాఖాధికారి నాగేశ్వరరావు తెలిపారు. ఈ పరీక్ష కోసం బాన్సువాడ పట్టణంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసిననట్లు తెలిపారు. బాయ్స్ బాన్సువాడ పాఠశాలలో 219 మంది విద్యార్థులు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 219 మంది విద్యార్థులు, కొనబాన్సువాడ పాఠశాలలో 200 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్ష సమయానికి కంటే ముందే కేంద్రాలకు చేరుకోవాలని ఆయన సూచించారు.

నిజాంసాగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో శనివారం నవోదయ విద్యాలయంలో ఆరవ తరగతిలో ప్రవేశం కోసం జిల్లాలో 28 పరీక్ష కేంద్రాల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ మణి తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలు రెండు గంటల పాటు నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ కార్యక్రమం

కామారెడ్డి టౌన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ కామారెడ్డి వివేకానంద వారి ఆధ్వర్యంలో ఇంపాక్ట్ ఇంటర్‌నేషనల్ వ్యక్తిత్వ వికాసం సంస్థ బృందం వారిచే విద్యార్థులకు ఉచిత వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మారుతి తెలిపారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒకటి గంటల వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివే పదో తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఇంటర్మీడియట్ విద్యార్థులకు, మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు డిగ్రీ, పీజీ విద్యార్థులతో పాటు ఉద్యోగులు, వ్యాపారస్తులు, తల్లిదండ్రులు యువతకు ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు.

గడికోటలో జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు ప్రారంభం

దోమకొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గడికోటలో శుక్రవారం నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు సంబంధించి జూనియర్ ఆర్చరీ సెలక్షన్స్ నిర్వహించినట్లు కోచ్ ప్రతాప్‌దాస్ తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్చరీ అధ్యక్షుడు తిర్మల్‌గౌడ్, మురళి, భూపాల్‌రెడ్డి, మధు, రమేష్, రవి, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

మాలపోచమ్మ ఆలయంలో అభివృద్ధి పనుల ప్రారంభం

దోమకొండ, (బీబీపేట) జనవరి 17(ఆంధ్రజ్యోతి): బీబీపేట మండలంలోని ఉప్పర్‌పల్లి గ్రామంలో మాలపోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి స్వంత నిధులతో గ్రానైట్ పనులు శుక్రవారం ప్రారంభించారు. ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే ఆలయాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రంజిత్‌గౌడ్, రవీందర్, బీజేవైఎం మండలాధ్యక్షుడు పోసు శివ కుమార్, ప్రవీణ్, సంతోష్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

26 నుంచి రైతు భరోసా డబ్బుల జమ

● జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్

పిట్లం జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26 నుంచి రైతుల ఖాతాలలో ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు జమ చేయడం జరుగుతుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయమార్కెట్ కమిటి కార్యాలయంలో ఎమ్మెల్యే మండల స్థాయి అధికారులు తహశీల్దార్, ఎంపీడీవో, ఎంపీవోలతో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్ష సమావెశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం ఈ నెల 26 నుంచి రైతు భరోసా నిదులు రైతుల ఖాతాలలో జమ చేయబోతుంది. అదేవిధంగా కొత్త రేషన్‌కార్డ్‌లు, ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ భరోసాపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ ఈ పథకాలు అందేలా చుడాలని, పథకాల అమలులో ఎటువంటి నిర్లక్షం, జాప్యం జరుగకుడదని ఎమ్మెల్యే అధికారులకు ఆదేశించారు.

గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన

పెద్దకొడప్‌గల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందుతుందని జుక్కల్ ఎమ్మేల్మే తోట లక్ష్మీకాంతారావ్ పేర్కొన్నారు. శుక్రవారం జుక్కల్ క్యాంపు కార్యాలయంలో గురుకుల పాఠశాలకు సంబంధించిన ప్రవేశ పరీక్ష పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మేల్యే తోట మాట్లాడుతు రాష్ట్రంలో ఉన్న పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడానికి ప్రభుత్వం గురుకులాలను ఏర్పాటు చేసిందని తెలిపారు, గతంలో మాదిరిగా కాకుండ ఈ సారి తమ ప్రభుత్వం విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచడంతో నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించడం జరిగిందని తెలిపారు. గురుకులాలలో ప్రవేశాలు 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు ఉంటాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గురుకుల ప్రవేశాలకు 01-02-25 చివరి తేదని ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 23 ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్ దేశాయ్,నాగనాథ్, హన్మండ్లు, పెద్ద కొడప్‌గల్ గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ నాగరాణి, ఉపాధ్యాయులు రాములు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రక్త దానం మరొకరికి ప్రాణదానం

మద్నూర్: అనంత శ్రీ విభూషత్ జగద్గురు రామా నందచార్య శ్రీ స్వామి నరేంద్రచార్య మహరాజ్ జుక్కల్ ఉప పీఠం, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలు అభినందనీయమని జుక్కల్ శాసనసభ్యుడు తోట లక్ష్మీకాంతరావు అన్నారు. శుక్రవారం జుక్కల్ మండల కేంద్రంలోని జగద్గురు ఉప పీఠంలో జరిగిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జుక్కల్ నియోజకవర్గంలోని ఆయా మండలా ల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్న జగద్గురు నరేంద్ర చార్య మహరాజ్ భక్తులకు అభినందించారు. ఒకరు చేసే రక్తదానం మరొకరికి ప్రాణదాన మవుతుందని గుర్తు చేశారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంత పురోగతి సాధించినా రక్తాన్ని మనిషి నుంచి సేకరించాల్సిందే తప్ప కృత్రిమంగా తయారు చేయలేమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సాయాగౌడ్, మాజీ సర్పంచ్ రమేష్ దేశాయ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు హన్మాండ్లు స్వామి, నాయకులు రమేష్, భక్తులు గంగారాం. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకాల ప్రకారం సర్వే నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



మండలంలో సాగు సర్వేలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్

మద్నూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలలో అర్హులైన నిరుపేదలకు అందేలా క్షేత్రస్థాయిలో అన్ని శాఖల అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సర్వే చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని లచ్చన్, అంతాపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న సంక్షేమ పథకాల ప్రక్రియను ఆయన సందర్శించి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల పథకాలకు ప్రజలు దరఖాస్తు చేసుకోగా అట్టి దరఖాస్తులను ప్రభుత్వం తెలిపిన మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో అధికారులు సర్వే చేసి లబ్ధిదారులను గుర్తించాలని పేర్కొన్నారు. సాగులో లేని ఇల్లు లేదా కాలనీలుగా మారిన అన్ని రకాల భూములు, రియల్ ఎస్టేట్, లేఅవుట్ రోడ్లుగా మారిన భూములు, పరిశ్రమలకు, గోదాములకు, మైనింగ్ లకు వినియోగిస్తున్న భూములు ప్రభుత్వం సేకరించిన అన్ని రకాల భూములు రాళ్ల రప్పలు, గుట్టలతో నిండి సాగుకు అనువుగా లేని భూముల వివరాలను సేకరిస్తున్నట్లు వెల్లడించారు. సర్వే ప్రక్రియను ఈ నెల 20 వరకు కొనసాగుతుందని కుటుంబాల సమగ్ర సర్వే వివ రాలను తెలుసుకొని ఆయా పత్రాల పరిశీలించి పార్ములా నమోదు చేయాలని ప్రక్రియ సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ముజీబ్, ఎంపీడీవో రాణి, వ్యవసాయ అధికారి రాజు, ఆర్ఐ శంకర్ ఉన్నారు.

సర్వేలో అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందించాలి

పిట్లం: ప్రభుత్వ పథకాలు పొందెందుకు అర్హులైన లబ్ధిదారులకు గుర్తించాలని అడీషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలో ప్రత్యేక అధికారులు ఇంటింటి తిరిగి సర్వే చెపట్టారు. ఈ సర్వె తీరును అడిషనల్ కలెక్టర్ అధికారులకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 21 వరకు ప్రతీ గ్రామంలో గ్రామ సభలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో కమలాకర్, ఏవో కమల ఉన్నారు.

పెద్దకొడప్‌గల్: జుక్కల్ మండలంలో జరుగుతున్న రేషన్ కార్డుల సర్వేను పకడ్బందిగా చేపట్టాలని బాన్స్‌వాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అధికారులకు సూచించారు. శుక్రవారం జుక్కల్ గ్రామంలో జరుగుతున్న రేషన్‌కార్డుల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ కార్డులు లేని వారికి కుల గణన సర్వే ఆధారంగా రేషన్ కార్డులు మంజూరు చేసిందని, మండల స్థాయి అధికారులు సర్వే చేసిన అనంతరం కొత్త కార్డులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు, రేషన్ కార్డులు మంజూరు అయిన వారి వివరాలు పరిశీలించారు. అనంతరం రైతు భరోసా పథకంకు సంబంధించి జుక్కల్ మండల కేంద్రంలో అనర్హుల వివరాలను అడిగి తెలుసుకున్నారు, వ్యవసాయ, రెవిన్యూ అధి కారులు సమన్వయంతో కలిసి గ్రామాలలో రైతు భరోసా పథకంలో అనర్హుల వివరాలు గుర్తించాలని అధికారులకు ఆదేశించారు, ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హిమబిందు, వ్యవసాయాధికారి మహేశ్వరి. ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

అర్హులైన నిరుపేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు

● జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్

నాగిరెడ్డిపేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన నిరుపేద కుటుంబాలకు వర్తించే విధంగా కృషి చేస్తున్నామని జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ తెలిపారు. ఆయన శుక్రవారం నాగిరెడ్డిపేట మండలంలోని ధర్మారెడ్డి గ్రామంలో అధికారులు నిర్వహిస్తున్న రైతు భరోసా, రేషన్ కార్డుల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి గ్రామాలలో నిర్వహిస్తున్న సర్వేను అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని, అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని ఆయన అధికారులను ఆదేశించారు. రైతు భరోసాకు సంబంధించి వ్యవసాయానికి యోగ్యంగా లేని భూములను సర్వే ద్వారా అధికారులు గుర్తిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 1060 ఎకరాల భూములు వ్యవసాయ యోగ్యానికి లేనట్టుగా గుర్తించడం జరిగిందని ఆయన తెలిపారు. అధికారులకు అందిన జాబితా ప్రకారం అధికారులు రేషన్ కార్డుల సర్వేను నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నే ప్రభాకర్, తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఎంపీడీవో ప్రభాకర్ చారి, వ్యవసాయ అధికారి సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

ఎల్లారెడ్డి: ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, రేషన్ కార్డుల జారీకి సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఎంపిక చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న రైతు భరోసా, రేషన్ కార్డుల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసాకు సాగులో ఉన్న భూములను గుర్తించాలని, అర్హులైన వారికి రేషన్ కార్డులు అందేవిధంగా చూడాలని సూచించారు. ఆయనతో పాటు ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్ అల్లం మహేందర్ కుమార్ అధికారులు ఉన్నారు.

గ్రామాల్లో రేషన్ కార్డుల సర్వే

దోమకొండ,(బీబీపేట): దోమకొండ, బీబీపేట మండలాల్లోని అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇతర సిబ్బందితో టీంలు ఏర్పాటు చేసి రేషన్ కార్డుల సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవోలు ప్రవీణ్ కుమార్, పూర్ణచంద్రోదయకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో సర్వే చేస్తున్న విధానాన్ని వారు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు రమేష్, అంజయ్య, భానుశ్రీ, వసంత, పద్మ, సౌందర్యశ్రీనివాస్, గంగుబాయి, కారోబర్‌లు పాల్గొన్నారు.

రైతు భరోసా సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి

నసురుల్లాబాద్: మండలంలో రైతు భరోసా సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి దయానంద్ అన్నారు. శుక్రవారం నసురుల్లాబాద్ మండల కేంద్రంతో పాటు దుర్కి, మిర్జాపూర్ క్లస్టర్ల పరిధిలో కొనసాగుతున్న రైతు భరోసా సర్వేను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ సర్వేలో ఎలాంటి తప్పులు జరగకుండా పంట పండించే రైతులందరికీ రైతు భరోసా అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్ర మంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఇంచార్జి ఎంపీడీవో సూర్య కాంత్, ఏవో భవాని, ఏఈవోలు, రెవెన్యూ సిబ్బంది, తదితరులున్నారు.

ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చాలి: ఎంవీఐ శ్రీనివాస్

బాన్సువాడ టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను సురక్షితంగా వారివారి గమ్య స్థానాలకు చేర్చాలని బాన్సువాడ ఎంవీఐ శ్రీనివాస్ డ్రైవర్లకు సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించి చెప్పారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సరితాదేవి, జానాబాయి, బసంత్, రాజారాం తదితరులున్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

కామారెడ్డిటౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డుభద్రతపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఎస్ఐ మహేష్, మహేశ్వరం ట్రాన్స్‌మిషన్ ప్రైవేట్ లిమిటెడ్ లైన్ మేనేజర్ వంశీ కృష్ణ అన్నారు. శుక్రవారం నిజాంసాగర్ చౌరస్తాలో రోడ్డుభద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రాజెక్ట్ మేనేజర్ ఆసీఫ్ హరిష్, మురళి పాల్గొన్నారు.

రేషన్ కార్డులను పరిశీలించిన ఎంపీడీవో

రామారెడ్డి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం, బట్టు తాండాలో రేషన్ కార్డులు, బట్టు తండా గ్రామ పంచాయితీ శుక్రవారం అకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డుల సర్వే తొందరగా పూర్తిచేయాలి పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. శానిటేషన్ పనులు, నర్సరీ పనులు సక్రమంగా ఉండే విదంగా చూడాలని పలు సలహాలు, సూచనలు, పద్దతులను వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అరవింద్ రెడ్డి, లింగాల సాగర్ గౌడ్ పాల్గొన్నారు.

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో పూజలు

నసురుల్లాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారం గ్రామ శివారులో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మెక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం కొచ్చేరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనం తరం భక్తులు కుటుంబసభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహపంక్తి భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

ప్రభుత్వ పథకాల అమలుకు అర్హుల వివరాల సేకరణ

రాజంపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్గోండ, బస్వన్నపల్లి గ్రామంలో శుక్రవారం లబ్ధిదారుల నుంచి రేషన్‌కార్డు, రైతుభరోసా దరఖాస్తులను పరిశీలించినట్లు మండల ప్రత్యేకాధికారి అపర్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన రేషన్‌కార్డు, రైతు భరోసా దరఖాస్తు చేసుకున్న లబ్దిదారుల నుంచి వివరాలు ఒకటికి రెండుసార్లు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఘురాం, ఏవో కృతి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మన్, స్వాతి పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఒకరి మృతి



లింగంపేటలో ప్రమాదానికి కారణమైన లారీ (ఇన్‌సెట్‌లో మృతి చెందిన మోహన్)

లింగంపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముస్తాపూర్ వద్ద గురువారం లారీ డ్రైవర్ అజాగ్రత్త, అతివేగంతో లారీని నడిపి ముస్తాపూర్ తండాకు చెందిన సభవత్ మోహన్(29)కు వెనుక వైపు నుంచి ఢీకొట్టి ప్రాణాలు తీసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. మోహన్ గురువారం సాయంత్రం పశువులను తీసుకుని ఇంటి వస్తుండగా ముస్తాపూర్ గ్రామ శివారులో రోడ్డు పక్క నుంచి నడుచుకుంటు వస్తుండగా కామారెడ్డి నుంచి లింగంపేట వైపునకు వస్తున్న లారీ అతివేగం, అజాగ్రత్తగా నడుపుతూ మోహన్‌ను వెనుకవైపు నుంచి ఢీకొట్టడంతో లారీ కింద ఇరుక్కు పోయాడు. నడుము భాగంలో, ఇతర చోట్ల బలమైన గాయాలు కావడంతో వెంటనే 108లో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తండావాసులు ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారిపై రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై సుధాకర్ బాధితులతో మాట్లాడి నచ్చ జెప్పారు. వారికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో వారు రాస్తారోకోను విరమించారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

● భయాందోళనలో రెండు గ్రామాల ప్రజలు



గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన ప్రాంతం

లింగంపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా లింగంపేట మండలంలోని కోమట్‌పల్లి- కేసాయిపేట గ్రామాల మధ్య గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు. దీంతో రెండు గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతు న్నారు. శుక్రవారం ఉదయం అటవి ప్రాంతానికి వెళ్లిన గ్రామస్థులకు అక్కడ గుంతలు తవ్వి, పసుపు కుంకుమ, నిమ్మ కాయలతో క్షుద్ర పూజలు చేసినట్లు ఆనవాళ్లు ఉండడంతో గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. దీంతో గ్రామస్తులు అక్కడకు వెళ్లి చూసి గుప్త నిధుల కోసం క్షుద్ర పూజలు చేశారని వారు భయాందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో పంట పొలాలకు వెళ్లే రైతులు భయాందోళన చెందుతున్నారు. గతంలో కోమట్‌పల్లి అటవి ప్రాంతంలో గుప్త నిధుల కోసం వచ్చిన వారిని పట్టుకుని పోలీసులకు అ ప్పగించారు. మరోసారి గు రువారం రాత్రి గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపి నట్లు అటవి ప్రాంతంలో ఆన వాలు ఉండడంతో ఇరు గ్రామాల ప్రజలు భయ పడుతున్నారు. దీనిపై స్థానిక ఎస్సై సుధాకర్‌ను వివరాణ కోరగా తనకు ఎలాంటి పిర్యాదు రాలేదని ఆయన తెలియజేవారు.

చిన్నకొడప్‌గల్‌లో మహిళ హత్య



హత్యకు గురైన సత్యవ్వ

పిట్లం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామంలో గురువారం రాత్రి సత్యవ్వ(55) గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో హత్యకు గురైంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం చిన్నకొడప్‌గల్ గ్రామానికి చెందిన సత్యవ్వకు 38 సంవత్సరాల క్రితం అల్లాపూర్ గ్రామానికి చెందిన అంజిగోండతో వివాహం జరిగింది. వీరికి ఒక కూతురు. కూతురుకు వివాహం జరిగి అత్తగారింట్లో ఉంటుంది. గత 35 సంవత్సరాల క్రితం భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో విడిపోయి సత్యవ్వ చిన్నకొడప్‌గల్‌లో ఒంటరిగా ఉంటుంది. అయితే గురువారం రాత్రి 6 గంటల సమయంలో సత్వవ్వ అన్న పాపుగొండ పొద్దున నుంచి కనిపించడం లేదని ఆమె ఇంటికి వెళ్లి చూడగా సత్యవ్వ ఇంట్లో చనిపోయి ఉంది. ఆమె ముక్కు, నోరు నుంచి రక్తం కారి ఉంది, దుర్వాసన వస్తుంది, ఆమె ఒంటిపై ఉన్న బంగారం, చెవి పోగు లు, పుస్తె, నల్లపూసల దండ కనిపించడం లేదని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు సత్యవ్వ ఒంటరిగా ఉందని, ఆమెను చంపి బంగారు ఆభరణాలు ఎత్తుకపోయిఉంటారని మృతురాలి అన్న పాపు గోండ ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై రాజు తెలిపారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించిన అధికారులు



బడీడు పిల్లలను బడిలో చేర్పిస్తున్న అధికారులు

నిజాంసాగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిజాంసాగర్ కాంప్లెక్స్ పరిధిలోని బంజే పల్లి హాబిటేషన్‌లో కాంట్రాపల్లి హర్షిత్‌కుమార్ అచ్చంపేట మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. గత ఐదు నెలలుగా పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. విద్యాశాఖలో జనవరి 8 నుంచి 30వ తేదీ వరకు జరుగుతున్న బడి బయట పిల్లల సర్వేలో భాగంగా సీఆర్పీ నర్సింలు 6 నుంచి 14ఏళ్ల బాల బాలికలను, 15 నుంచి 19 సంవత్సరాల బాల బాలికలను సర్వే ద్వారా గుర్తించి తగిన పాఠశాలలో, కళాశాలలో చదివే విధంగా కౌన్సెలింగ్ ఇచ్చి చేర్పించారు. ప్రత్యేకంగా 15 నుంచి 19 సంవత్సరాల వయసు కలిగి పాఠశాల లేదా కళాశాల విద్యకు దూరమైన లేదా ఆపి వేసిన విద్యార్థులకు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలలో డైరెక్ట్‌గా పదవ తరగతి లేదా ఇంటర్మీడియట్ విద్యలో ప్రవేశం కల్పించడం జరిగింది. అలాగే ఆరు నుంచి 14ఏళ్ల వయస్సు కలిగిన బాల బాలికలను స్థానిక పాఠశాలలో చేర్పించడం జరుగుతుంది. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరు గుర్తించి బడీడు కలిగి బడికి దూరమైన బాల బాలికలను బడిలో చేర్పించే ప్రయత్నం చేయాలని కోరారు.

భిక్కనూరులో వైన్స్ తనిఖీ

భిక్కనూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రంతో పాటుగా మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో గల వైన్స్‌లను దోమకొండ ఎక్సైజ్ శాఖ అధికారులు సీఐ మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా వైన్స్‌లలో స్టాక్ రిజిస్టర్లను, మద్యాన్ని పరిశీలించారు. ఈ మేరకు సీఐ మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా భిక్కనూరు, పెద్దమల్లారెడ్డి వైన్స్‌ల ను తనిఖీ చేయ్యడం జరిగిందని, వైన్స్‌లలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవ న్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దీపిక, సిబ్బంది పాల్గొన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

శాంతి - సంక్రాంతికి వస్తున్నాం
దర్శన్ - పుష్ప-2
ప్రియా 70 - డాకు మహారాజ్
ప్రియా 35 - గేమ్ చేంజర్

బాన్సువాడ

మహేశ్వరి - గేమ్ చేంజర్
వెంకటేశ్వర - డాకు మహారాజ్

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	160
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

